క్లుప్తంగా

శివయ్యకు రుద్రాభిషేకం



శివయ్యకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, పండితులు గర్భాలయంలో కొలువైన శివదేవునికి వేద మంత్రోచ్ఛరణలతో రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి వారికి నిర్వహించాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దు అయింది.

నారసింహునికి అభిషేకం



నారసింహునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామికి ఆదివారం ప్రదోష శాలిగ్రామ అభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చతుర్థి తిథిని పురస్కరించుకొని ముందుగా అర్చకులు ఆలయంలో విఘ్నేశ్వర పూజను నిర్వహించారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారికి, శాలిగ్రామానికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించి, నీరాజన మంత్ర పుష్పాలు నివేదనలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఈశ్వర శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రసలింగేశ్వరునికి రుద్రాభిషేకం



రసలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కన్నాపురంలోని శ్రీదుర్గా భవాని సమేత రసలింగేశ్వర స్వామికి ఆదివారం మహా రుద్రాభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొల్లూరి రాంబాబు, లక్ష్మి దంపతులు అభిషేక కార్యక్రమం నిర్విరామంగా నిర్వహించారు. నమకచమకం స్తోత్రాలను పన్నెండు సార్లు చదివితే రుద్రం అని అటువంటి రుద్రాలు పన్నెండు సార్లు చదవడాన్ని మహారుద్రం అంటారని దీనికి దాదాపు పన్నెండు గంటలు పడుతుందని అర్చకులు పేర్కొన్నారు.

సుందరకాండ పారాయణ ప్రారంభం



సుందరకాండ బ్రోచర్లను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి సుందరకాండ పారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ పదకొండో తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు పారాయణ నిర్వహిస్తామని పదకొండో తేదీన శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా పారాయణ నిర్వహించే భక్తులకు బ్రోచర్లను పాలకమండలి అధ్యక్షుడు మద్దు గోపి విడుదల చేశారు. మద్దిబోయిన శ్రీను, మద్దు ప్రసాద్, కొల్లూరి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ, ముసలమ్మతల్లి ఆలయంలో పూజలు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఉత్తర దిక్కున పొలిమేరలో వేంచేసిన శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారు, శ్రీ కుంటల ముసలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు భక్తులు పూజలు ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ దంపతులు పాల్గొన్నారు.

తొలకరికి ముందే వర్షాలు

- సాధారణంగా జూన్ రెండో వారంలో రుతుపవనాలు
- ఈ సారి మే నెలాఖరులోనే ప్రవేశిస్తాయని వెల్లడించిన వాతావరణశాఖ
- ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి రోజూ పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు



బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం

బుట్టాయగూడెం: ఆశల నైరుతి ముందస్తుగానే ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీపికబురు చెబుతుంది. సాధారణంగా జూన్ రెండో వారంతో కేరళను తాకే రుతుపవనాలు ఈ సారి ముందస్తుగానే ఈ నెల 26వ తేదీనే రుతు పవనాలు తాకనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే రోహిణీ కార్తె ప్రారంభానికి ముందు నుంచే జిల్లాతో పాటు మన్యం ప్రాంతాన్ని వరుణుడు పలకరించాడు. మండు వేసవిలో నిండుగా కమ్ముకొచ్చిన కారు మబ్బులతో గిరిజన ప్రాతంలో విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత వారం రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం దాటిన తర్వాత తొలకరి జల్లులు పలకరిస్తాయి. అయితే అకాల వర్షాలు, తుఫాన్లతో మరింత ముందుగా వానలు కురుస్తుండడంతో తొలకరి ముందుగానే వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది వచ్చే వానాకాలం ఖరీఫ్ సీజన్‌పై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముందుగా కురుస్తున్న వానలతో పలు చోట్ల రైతులు దుక్కులను కూడా సిద్ధం చేసుకున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూమి మరింత నానిందని రైతులు అంటున్నారు.

విచిత్ర వాతావరణం

రోహిణీ కార్తెలో ఎండలు రోళ్లే పగులుతాయని నానుడి. సూర్య భగవానుడు రోహిణి నక్షత్రంలో ఉన్న సమయంలో రోజు రోజుకూ వేడి పెరుగుతుంది. ఆ సమయంలో తీవ్రమైన ఎండలు కాస్తాయి. అయితే ఈ ఏడాది రోహిణి కార్తె ప్రారంభమైనా అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లగానే ఉంది. 8 రోజులు ముందుగానే రుతు పవనాలు కేరళను తాకడంతో ఎండల తీవ్రత ఉండే పరిస్థితి లేనట్లే కనిపిస్తుంది. మరో రెండు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతు పవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఎండల ప్రభావం ఉండకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణం చల్లబడడంతో తీవ్రమైన ఉక్కపోతల నుంచి అందరూ ఉపశమనం పొందుతున్నారు.

సహజ వనరులను దోచేందుకే
ఆపరేషన్ కగార్



మావోయిస్టులతో చర్చించాలని నినాదాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కుక్కునూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల్లో ఉన్న సహజ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్ చేపట్టినట్టు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చంద్రావు అధ్యక్షతన ఆదివారం మారేడుబాక గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ గిరిజన ప్రజలు 500 మంది మృతి చెందారని, 100 మంది వరకు మావోయిస్టులు మృతి చెందారన్నారు. ఒరిస్సాలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న నంబాల కేశవరావును పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కట్టం వీరాస్వామి, పోలవరం డివిజన్ కార్యదర్శి కట్టా ముత్యాలరావు, కుక్కునూరు మండల కార్యదర్శి కంగాల కల్లయ్య, జంగారెడ్డిగూడెం కార్యదర్శి పెరుమాళ్ల శ్రీను, మిరియాల సుజాత, కవులూరి సీత, మడివి మహేష్, గొప్ప ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు పంచాయతీ గిరిజన గ్రామం కిచప్పగూడెంలో ఆదివారం అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీపీ గంజిమాల రామారావు శ్రీకారం చుట్టారు. మడకం మోసే ఇంటినుండి పాత వాటర్ ట్యాంక్ వరకు నాలుగు లక్షలతో డ్రెయిన్ నిర్మాణం, లక్ష రూపాయలతో కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ సున్నం శాంత కుమారి తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న రెండు సమస్యలు పరిష్కారం కావడంతో గిరిజనులకు ఎంతో ప్రయోజనం కలుగునుందని ఆమె తెలిపారు. భువనగిరి ఆశీర్వాదం, సరియం బసవయ్య, అనిపెద్ది బంగారయ్య, సున్నం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



బొర్రంపాలెంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని బొమ్మగాని బాలకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కాన్సర్, గుండె సంబంధిత వ్యాధులతో పాటు, బీపీ, షుగర్, జనరల్ కేసులకు వైద్య సేవలు అందించారు. మొత్తం 190 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో యూత్ కన్వీనర్ కలపర్తి విజయ్, వీర్రాజు, సూర్య, సురేష్, రాజేష్, అనిల్, యువత పాల్గొన్నారు.

చాక్లెట్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చింతలపూడి: నియోజకవర్గంలో చాక్లెట్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని అల్లిపల్లిలో నిర్మించిన కోకో ఫెర్మంటేషన్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక కోకో ఫర్మెంటేషన్ ప్లాంట్ చింతలపూడి మండలం అల్లిపల్లిలో ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి ఎండీ షాఫియా ఫర్వీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ ఎంపీపీ టి.రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సచివాలయ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): నగరంలోని అన్ని వర్గాల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల సిబ్బంది యోగాంధ్రా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన పరిచి వారి పేర్లను యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు. ప్రజల్లో యోగా పై అవగాహన కలిగించేందుకు ఈ నెల 27న పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేత



చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న స్వచ్ఛ భారత్ వాకర్స్ సభ్యులు

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ భారత్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు, వంగాయగూడెం యాపిల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ లో ఉన్న హెచ్ఐవి పిల్లలకు ఆదివారం పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైఎస్ కనకారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ సంస్థలో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, ప్రోటీన్ ఫుడ్ అందిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ బాధితులు మనోధైర్యంతో జీవించాలని, మంచి ఆహారం తీసుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడటం ద్వారా జీవిత కాలాన్ని మరింత పెంచుకోవచ్చని అన్నారు. ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశెనగగుళ్లు, రాగి పిండి ఇతర పౌష్టికాహారం కలిగిన కిట్లను హెచ్ఐవీ బాధితులకు స్వచ్ఛభారత్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మధ్యాహ్నం వెంకటేశ్వరరావు, కట్టా ఈశ్వర రావు, చిదరపోయిన శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరు చంద్రశేఖర్, చేకూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోసపాడు కోర్ జిల్లాకు ఆదర్శం కావాలి

దెందులూరు: దోసపాడు సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మికంగా జిల్లాకు ఆదర్శం కావాలని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజు లత అన్నారు. ఏలూరు డివిజనల్ కమాండర్‌గా నియమితులై తొలిసారిగా దోసపాడు కోర్టు విచ్చేసిన డివిజనల్ కమాండర్ దంపతులకు గ్రామంలో స్వాగతం లభించింది. స్థానిక కోర్ ఆఫీసర్ జోసఫ్ కటాక్షం సంఘ పెద్దలు సంఘస్తులు గృహ సమితి సభ్యులు, యువత, చిన్నారులు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి వివిధ రకాల పుష్పాలతో వారిపై చల్లుతూ చర్చి వరకు మేళ తాళాలు క్రైస్తవ గీతాలాపనలతో తీసుకెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్



జంగారెడ్డిగూడెం: మానవత నూతన కమిటీని అభినందిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మానవత మండల కమిటీ సమావేశం ఆదివారం గుర్వాయిగూడెంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రెసిడెంట్ మానవతా మూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. 2025–26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు మానవత సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా అల్లూరి రామకృష్ణ, సెక్రటరీగా టి.మధు, ట్రెజరర్‌గా మాధవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అయినాల రమణమూర్తి, సెక్రటరీ గద్దె సత్యనారాయణ, ట్రెజరర్ ఇమ్మంది మాధవరావు, మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు, సెంట్రల్ కమిటీ డైరెక్టర్ మహంకాళి రంగప్రసాద్, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, దల్లి పెదవీరాజు రెడ్డి, ఆడిట్ కమిటీ చైర్మన్ డీకే రెడ్డి, కార్యవర్గ సభ్యులు డి.ఆంజనేయ రెడ్డి, ఎలికే తాతారావు, ఎలికే ప్రసాద్, టీవీ గోపాలరావు, పల్లి వెంకటరెడ్డి, వంకా వెంకటేశ్వరావు, ఎల్ఐసీ కృష్ణమూర్తి, టి.అయ్యన్న, కొండ్రెడ్డి సోమరాజు, డీఎఫ్ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



చింతలపూడి: ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాయని లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పంకజాక్షన్ పేర్కొన్నారు. గోలి రంగారావు, రామానుజమ్మ లయన్స్ సేవా కేంద్రంలో చింతలపూడి లయన్స్ క్లబ్ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పంకజాక్షన్ మాట్లాడుతూ నేటి యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా అడపా శ్రీనివాసరావు, కార్యదర్శిగా దుగ్గిరాల రామకృష్ణ, ట్రెజరర్‌గా రాజగోపాల్ ఇతర సభ్యులచే పంకజాక్షన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి జిల్లా ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్లు పుట్ట విజయశ్రీ, సూర్యనారాయణరాజు, జీఎస్‌టీ కో–ఆర్డినేటర్ చిల్లపల్లి రామమోహన్‌రావు, ఎలక్ట్ రీజియన్ చైర్ పర్సన్ రత్న కుమారి, మాజీ అధ్యక్షురాలు చిల్లపల్లి విజయ లక్ష్మి, మాజీ కార్యదర్శి మాధవి, మాజీ ట్రెజరర్ కృష్ణకుమారి, గోలి చంద్రశేఖర్ రెడ్డి, ఎ.పవన్‌కుమార్, చుండూరు అబ్బయ్య, చిక్కాల సుధాకర్, మాడా శ్రీనివాసరావు, సత్యనారాయణ, గాంధీ, రాజేష్ ఖన్నా, జల్లిపల్లి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం: మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన రమాదేవికి, వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో 8 నెలల క్రితం వివాహమైంది. మంగరాజు మందబుద్ధితో ఉండటంతో, తనకు తింగరివాడిని ఇచ్చి పెళ్లి చేశారంటూ రమాదేవి మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో 13వ తేదీన వేగవరంలోని ఇంటి వద్ద పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు, విజయవాడ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 24వ తేదీన మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తండ్రి గారపాటి మంగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీపీఐ మహా సభలను జయప్రదం చేయండి

చింతలపూడి: జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు స్థానిక పాత చింతలపూడి సీపీఐ శాఖ సమావేశం ఆదివారం బోడ వజ్రం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, ముల్లగిరి నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి దంతా కష్ణ, శాఖ సహాయ కార్యదర్శి తొర్లపాటి రాజు, సభ్యులు ఎం.లాజరు, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం గడ్డపల్లికి చెందిన కెచ్చెల సీతారెడ్డి అమాయకుడు, సరిగా మాట్లాడలేడు. దీంతో సీతారెడ్డి వదిన కెచ్చెల నాగమణి ఈ నెల 24న దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం ఏలూరు వెళ్లి అక్కడ పని చూసుకొని, తిరుగు ప్రయాణంలో జంగారెడ్డిగూడెం వచ్చారు. గడ్డపల్లి వెళ్లేందుకు బస్సు కోసం చూస్తుండగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాత్రూమ్‌కని సీతారెడ్డి వెళ్లి రాలేదన్నారు. దీంతో చుట్టు పక్కల, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత లోక్‌నాథ్ రెడ్డి మృతి తీరని లోటు

ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



లోకనాథ్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దూలం నాగేశ్వరరావు, నేతలు

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముల్లంగి లోకనాథ్ రెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి, వారి కుటుంబానికి తీరని లోటని ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ముడిచర్ల గ్రామంలో లోకనాథ రెడ్డి పెద్ద కర్మను పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి, ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు లోకనాథ్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్ట సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



స్ఫూర్తి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, తదితరులు

ఏలూరు (టూటౌన్) : గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2న ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులతో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం ఈ ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నారని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని విమర్శించారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న వాగ్దానాలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2నఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులతో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు సిలిండర్లు పేరుతో ఇచ్చే సబ్సిడీ తొలి సిలిండర్‌కు సంబంధించి నేటికీ చాలామందికి తమ ఖాతాలో సబ్సిడీ నగదు పడలేదని, ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు .రైతులకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వాయిదాలతో కాలయాపన చేస్తున్నారని తక్షణం రైతులకు ఖాతాలలో నగదు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి,బేతా శంకర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.